భక్తిశ్రద్ధలతో బాలత్రిపుర సుందరీదేవికి పూజలు



అన్నదానం చేస్తున్న ఆలయ చైర్మన్ రవీందర్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్

కవాడిగూడ: దోమలగూడ అడ్వకేట్స్‌కాలనీలోని బాలత్రిపుర సుందరీదేవి, పంచముఖి హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాల నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, కార్పొరేటర్ జి.రచనశ్రీ, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వందలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, పరిమల్ కుమార్, శివరాజ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ పూజలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నిర్వాహకులు

అంబర్‌పేట: రేణుకాఎల్లమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లో నిర్వహించిన వేడుకలు కనులపండువగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే హోమాలు, మహాపూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, దిష్టకుంభం, శాంతి కళ్యాణం వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నాదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి, దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను నిర్వాహకులు రావుల ప్రదీప్, బ్రహ్మచారి, కె.శివరామకృష్ణ, సతీష్, పూర్ణచందర్, సీహెచ్ శ్రీనివాస్‌గుప్తా, కె.శ్రీనివాస్, మురళి కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో కులనిర్మూలన, సమానత్వం కోసం ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రమ్య, అస్లాంల ఆదర్శ వివాహం జరిగింది. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. ఆదర్శ వివాహాలే నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. కుల మత విద్వేషాలను రూపుమాపడానికి కులాంతర, మతాంతర వివాహాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్, టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు ఎండీ వాహెద్, ఆర్.వెంకట్ రాములు, బుర్రి ప్రసాద్, కోటా రమేష్, దీప్తిషా,ఎండీ.జావెద్, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏడాదిగా తలసేమియాతో బాధపడుతున్న బల్లెం ప్రణయ్ చికిత్సకు ఆర్థికసాయం చేసిన ఎన్ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఆపరేషన్ కోసం ప్రభుత్వం 20 లక్షల సహకారం చేస్తున్నప్పటికీ ఇతర ఖర్చులను భరించడానికి మానవతా దృక్పథంతో ఎన్ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి ముందుకు రావడం హర్షణీయమని అన్నారు.

మంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు

కవాడిగూడ: కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల పక్షమని, దళిత బహుజన మైనార్టీలకు తగిన గౌరవం ఇస్తోందని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి లక్ష్మీకాంత్ సునిల్ అన్నారు. దళిత పక్షపాతి స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బాటలోనే సీఎం రేవంత్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనం రెండోసారి చేపట్టిన మంత్రివర్గ విస్తరణే అని పేర్కొన్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని ఆదివారం లక్ష్మీకాంత్ సునిల్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆత్మరక్షణకే కాదు ఆరోగ్యానికి కరాటే చక్కటి సాధనం

కాచిగూడ: ఆత్మరక్షణ కోసమే కాదూ.. ఆరోగ్యానికి 'కరాటే'చక్కటి సాధనంగా ఉపకరిస్తుందని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జామినర్ షిహాన్ రాపోలు సుదర్శన్ అన్నారు. కరాటే కోచ్ దామోదర్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం హెల్త్ లీగ్ క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో పోటీ పడి అర్హత సాధించిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలతో పాటు కలర్ గ్రేడింగ్ బెల్టులను ప్రదానం చేశారు.

ఎనీ టైమ్ మందు.!



కాచిగూడ ఎక్సైజ్ పోలీసు స్టేషన్

కాచిగూడ ఎక్సైజ్ ఠాణా పరిధిలో అడ్డూ అదుపు లేకుండా బెల్టుషాపుల నిర్వహణ

- పొద్దు పొడవక ముందే మద్యం విక్రయాలు
- కొన్ని బార్‌లలో ఉదయం కాఫీ, టీ లాగా పెగ్గులు విక్రయిస్తున్న వైనం
- ప్రేక్షకపాత్రలో ఎక్సైజ్ పోలీసులు

అంబర్‌పేట: పొద్దు పొడవక ముందే మద్యం అందుబాటులోకి వస్తోంది. 24 గంటలు మద్యం లభిస్తుండటంతో పేదల జీవితాలు మరింత దిగజారిపోతున్నాయి. రోజువారి కూలీలు నిద్ర లేవగానే బెల్టుషాపుల బాట పడుతున్నారు. కాచిగూడ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో బెల్టు షాపులు మూడు పూలు ఆరు కాయలుగా నడుస్తున్నాయి. పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. దీంతో బెల్టు షాపుల నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. గోల్నాక మూసీ పరీవాహక ప్రాంతాలైన కమలానగర్, న్యూ గంగానగర్, లంకబస్తీలు, ఆహ్మద్‌నగర్, కాచిగూడలతో పాటు కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో ఉదయం 6 నుంచే మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఉదయం 10గంటల తరువాత లభించాల్సిన మద్యం సూర్యోదయానికి ముందే మద్యం విక్రయాలు జరుగుతుండటం దారుణం. ఇప్పటికైన బెల్టు షాపులను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

రోజువారీ కూలీలు బతుకు ఛిద్రం...

◆ బెల్టు షాపులతో రోజువారీ కూలీల రోజువారి **జీవితం ఆగం అవుతోంది. వారు నిద్ర లేవగానే కూలి పని కోసం ఇంట్లో బయలుదేరి మొదట** బెల్టు షాపులకు వెళ్తున్నారు. అక్కడ మద్యం సేవించి కూలీ అడ్డమీదకు వస్తున్నారు. మద్యం సేవించి ఉండడంతో పనికి వీరిని నిరాకరిస్తున్నారు. దీంతో ఆ రోజు ఉపాధి లేకుండా పోవడంతో వారు తిరిగి మద్యం వైపు వెళ్లి రోజంత రోడ్లపై ఉంటూ ఇంటికి వెళ్తున్నారు. నిత్యం చాలా మంది కూలీలు ఇలాంటి రోజు వారి జీవనం సాగిస్తుండడంతో వారి కుటుంబాల్లో గొడవలు అయి రోడ్డు పాలువుతున్నారు. అలాగే మద్యం సేవించక కూలి పనికి వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. వీరికి ఉదయం మద్యం లభించకపోతే కూలీ పని అయ్యాక మద్యం తీసుకుంటే వచ్చే ఇబ్బందులు ఉండవని పలువురు పేర్కొంటున్నారు. వచ్చిన కూలి డబ్బులు ఉదయం కూలి పనికి ముందు, కూలి పని తరువాత తాగాడానికి ఖర్చు చేయడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటా

బెల్టు దుకాణలపై స్థానికులు నేరుగా ఫిర్యాదుల చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటాను. బెల్టు షాపులకు మద్యం విక్రయించేందుకు ఎలాంటి అనుమతులు లేవు. అలాగే మద్యం దుకాణాల దారులు వారికి సూచించిన వేళల్లోనే విక్రయాలు సాగించాలి. బార్ అండ్ రెస్టారెంట్లపై సైతం నిఘా వేసి నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాను.

– కాచిగూడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్

ప్రోత్సహిస్తున్న మద్యం వ్యాపారులు..

◆ మద్యం దుకాణాలదారులకు మద్యం విక్రయాల కోసం ప్రత్యేక సమయం ఉండటంతో మరింత విక్రయాలు సాగించడానికి బెల్టు షాపులను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. అంబర్‌పేటలోని కొందరు మద్యం దుకాణాదారులు బెల్టు షాపు నిర్వాహకులతో ఒప్పందాలు కుదుర్చుకుని విక్రయాలకు పాల్పడుతున్నారు. ఉదయం 6 నుంచి 10గంటల వరకు కొంత మద్యం విక్రయించినా వ్యాపారం అవుతుందన్న ధోరణిలో బెల్టు షాపులను వెనుకుండి నడిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో ఉదయం కాఫీ, టీ మాదిరిగా మద్యం విక్రయాలు సాగిస్తున్నప్పటికీ ఎక్సైజ్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఇలాంటి వాటిపై ఎక్సైజ్ పోలీసులు దృష్టి సారించి ఉదయం సమయంలో మద్యం విక్రయాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

పద్మశాలీలు ఐకమత్యంతో రాజకీయంగా ఎదగాలి





పద్మశాలి సంఘ భవన నిర్మాణం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: పద్మశాలి సేవా సంఘం రాంనగర్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం కోశాధికారి కొక్కుల దేవేందర్, సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్ అధ్యక్షులుగా వ్యవహరించారు. సంఘం కార్యదర్శి నివేదిక, ప్రగతిని, పానుగంటి మురళీకృష్ణ చదివివినిపించారు. అఖిల భారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కె.మురళీ, సలహాదారులు చెరుపల్లి యాదగిరి, పూరపాటి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు మిర్యాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవనానికి విరాళాలు ఇచ్చిన దాతలకు సన్మానం చేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ కిషన్‌రెడ్డిలు తమ ఎమ్మెల్యే, ఎంపీ నిధుల ద్వారా భవన అభివృద్ధికి కృషి చేశామన్నారు. తెలంగాణ కనిజ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ఈరవత్రి అనిల్‌కుమార్ మాట్లాడుతూ... పద్మశాలీలంతా ఐకమత్యంతో రాజకీయంగా ఎదగాలని కోరారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా అధ్యక్షురాలు గుంటక రూప తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ పేరు మీద ఒక మొక్క'



బాగ్‌లింగంపల్లిలో కమ్యూనిటీ హాల్ వద్ద మొక్కలను నాటుతున్న గుండగొని భరత్‌గౌడ్


సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మొక్కలు సమస్త జీవ రాశులకు ప్రాణవాయువు అని మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగొని భరత్‌గౌడ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని కమ్యూనిటీహాల్ వద్ద 'అమ్మ పేరు మీద ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ... చెట్లను సంరక్షించడంతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవిచారి, సీనియర్ నాయకులు జయపాల్‌రెడ్డి, కాలకోట అరుణ్, ఉపేందర్, గడ్డం నవీన్, శివాజీ, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌లో 25 ఎస్టీ హాస్టల్స్ మంజూరు చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: ఇన్నాళ్లు విద్యకు దూరమైన గిరిజన విద్యార్థులు ఇప్పుడిప్పుడే చదువుకోవడానికి ముందుకొస్తున్నారని... వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఎస్టీ విద్యార్థులు చదువుకోవడానికి హాస్టల్స్ వసతి లేక, ఉన్న కొద్ది హాస్టల్స్‌లో సీట్లు దొరకక విద్యార్థులు చదువులను మధ్యలోనే మానేస్తున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్టీ విద్యార్థులు చదువుకోవడానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బాలికలకు 15, బాలురకు 10 హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ హాస్టళ్లలో ఉండి చదువుకునే ఆర్థిక స్తోమత ఎస్టీ విద్యార్థులకు లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఎస్టీ హాస్టళ్లను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. సామాజిక వివక్షతతో సమాజం ఎస్టీలను ఇంకా చిన్నచూపు చూస్తోందన్నారు. ఎస్టీలకు విద్య ద్వారానే సమాజంలో సరైన గుర్తింపు లభిస్తుందని అన్నారు.

'గోపీనాథ్ మరణ వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది'



మాగంటి గోపీనాథ్ అంత్యక్రియల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సహచర ఎమ్మెల్యేను కోల్పోవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేందన్నారు. ఆదివారం జరిగిన మాగంటి గోపీనాథ్ అంత్యక్రియాల్లో ఆయన పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

అడిక్‌మెట్‌లో నివాళి...



నివాళులర్పిస్తున్న అడిక్‌మెట్ బీఆర్ఎస్ నేతలు

ముషీరాబాద్: అనారోగ్యంతో మృతి చెందిన జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం అడిక్‌మెట్‌లో మాగంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, నేత శ్రీనివాస్, రవియాదవ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు

నల్లకుంట: శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని గానసభ కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాసశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి(న్యూ రామాలయం) ప్రాంగణంలో వారం రోజుల పాటు ఈ వేడుకలు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటలకు సంగీత కచేరీలు ఉంటాయని చెప్పారు. ఇందులో ప్రముఖ సంగీత విద్వాంసులు పాల్గొని వివిధ భాషల్లోని వాగ్గేయకారుల కీర్తనలు గానం చేస్తారని పేర్కొన్నారు. సంగీతాభిమానులు పెద్ద ఎత్తున హాజరై సంగీత ఆరాధన సంగీతోత్సవాలను విజయవంతం చేయాలని శ్రీనివాస శర్మ కోరారు.

దివ్యాంగుల ఉచిత పరికరాలకు దరఖాస్తుల స్వీకరణ

అంబర్‌పేట: దివ్యాంగుల కోసం ఉచిత పరికరాలను అందించేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎన్‌పీఆర్‌డీ సంస్థ అంబర్‌పేట నియోజకవర్గం కమిటీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఉపకరణాలను అందిస్తున్నామని అన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 18వ తేదీలోపు తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రతిభగల విద్యార్థులకు సత్కారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం యోజన విభాగం ఆధ్వర్యంలో టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కార కార్యక్రమం జరిగింది. బాగ్‌లింగంపల్లిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా ఎమ్మెల్సీ కొదండరాం, సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల సంఘమేశ్వర్ హాజరై విద్యార్థులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పెద్దపట్ల భరత్‌కుమార్, సోమేష్, మహేష్, శివకుమార్, శశికుమార్, దినేష్ పటేల్, శివశరణ్, సూర్యశ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం

కాచిగూడ: శివరాంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నం.1పైన ఓ గుర్తుతెలియని వృద్ధుడి (60) మృతదేహాన్ని కాచిగూడ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ బి కేటగిరి సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ బి కేటగిరి సీట్లను ఆన్‌లైన్ కౌన్సెలింగ్, మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయాలని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ (టీఆర్ఎస్‌యూ)రాష్ట్ర అధ్యక్షుడు బోయ రమేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులను ఆదివారం కోరారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో బీటెక్,బీఈ, బీఫార్మసీ, ఫార్మడీ కోర్సుల్లో 30శాతం సీట్లను నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయాలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.దీని వలన మెరిట్ గల పేద, మధ్య తరగతి విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. పాత పద్ధతిలోనే సీట్లను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సివిల్స్ ఉద్యోగుల పాత్ర కీలకం

మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు





ఉత్తమ ర్యాంకు సాధించిన అభ్యర్థిని సన్మానించి మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశ నిర్మాణంలో సివిల్ సర్వీసు ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 2024 సివిల్ సర్వీసులో ఉత్తమ ర్యాంకులు సాధించిన 17 మందిని సత్కరించి ఆయన మాట్లాడారు. మన రాజ్యాంగం అతి పెద్దది వజ్రాయుధం లాంటిదిని అన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా, యువత ఉన్న మన దేశం సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని వారికి సూచించారు. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ ఆర్థిక సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలన్నారు. కులాంతర వివాహాలతో పాటే సమానత్వం లభిస్తుందని అంబేడ్కర్ భావించారని గుర్తుచేశారు. డాక్టర్ అంబేడ్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి దూరదృష్టి గల నాయకుల ఆశయాలకు అంకితం కావాలని సూచించారు. అదనపు డీజీపీ మహేష్‌భగవత్ మాట్లాడుతూ... యువత సివిల్ సర్వీసు వైపు రావాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్, డైరెక్టర్ డాక్టర్ భవానీశంకర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు టి.చిరంజీవులు, ఎం.గోపాలకృష్ణ, బీపీ.ఆచార్య, డి.చక్రపాణి, వీఎస్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లో నూతనంగా ఏర్పాటైన జనప్రియ అబోడ్స్ వాకర్స్ క్లబ్ గాంధీ నగర్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. నూతన అధ్యక్షులు జి.నాగాధర్, కె.నిరంజన్, కోశాధికారిగా జి.హరిప్రసాద్ నిమితులయ్యారు. వీరి చేత డిస్ట్రిక్ గవర్నర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి నిత్యం నడకతో ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పావనివినయ్ కుమార్, ప్రముఖులు లింగప్రకాష్, గంగాధర్ రెడ్డి, శైలజమోహన్, విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



గాంధీనగర్ డివిజన్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: భారతప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నేతలు, కార్యకర్తలు ప్రజలకు వివరించి అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ సూచించారు. ఆదివారం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో నిర్వహించిన బీజేపీ డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి మరంత కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ మేయర్ పీఠం కైవసం చేసుకునేలా అందరూ కలసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పార్టీ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, నవీన్‌కుమార్, శ్రీకాంత్, వీఎస్టీరాజు, సత్తిరెడ్డి, బాలకృష్ణ, విష్ణుప్రాసద్, శ్రీనివాసయాదవ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణలీలామృతం.. రత్న అవార్డుల ప్రదానోత్సవం





నృత్య రూపక ప్రదర్శన, అవార్డు గ్రహీతలతో అతిథులు

చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కురగంటి కళాక్షేత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో ట్రస్ట్ 28వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపకురాలు, కూచిపూడి నృత్య గురువు కె.రాధిక పర్యవేక్షణలో 50మంది శిష్యులు డాక్టర్ కుందనిక కళాకారుల బృందం ప్రదర్శించిన 'శ్రీకృష్ణ లీలామృతం'కూచిపూడి నృత్యరూపక ప్రదర్శన ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. అనంతరం రత్న అవార్డులను డాక్టర్ బి.చంద్రకాంతరావు, వేణుగంటి శ్రీధరాచార్య, ఎండి రఫీ, వాణిరమణ, తమన్నాశ్రీధర్‌లకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సింహనందిని నృత్యకళాకారిణి ఓలేటి రంగమణి, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ వై.మల్లేశ్వర్, తంగిరాల నరేష్, సీనియర్ పాత్రికేయులు డా. శంకేపల్లి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలి



సమావేశంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.యశ్వంత్ ఆధ్వర్యంలో ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేవైఎం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ చేసిన అభివృద్ధి వివరించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. ప్రపంచ దేశాలతో పోటీపడి మన భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలపడానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, డాక్టర్ ఎస్.గౌతంరావు, మహేందర్, కృష్ణగౌడ్, సందీప్ సాయి, ఎడెల్లి అజయ్‌కుమార్, దిలీప్ సింగ్, వెంకీ, డి.శేఖర్, విక్కీసింగ్, ముఖేష్, విజయ్ సింగ్, సుమన్, నరేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి



బర్కత్‌పురలో జీహెచ్ఎంసీ స్వీపర్స్‌కు చీరలు పంపిణీ చేస్తున్న దేవిరెడ్డి విజితారెడ్డి

కాచిగూడ: సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని కూచికుళ్ళ విమల సుధాకర్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ దేవిరెడ్డి విజితారెడ్డి అన్నారు. విమల సుధాకర్‌రెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలో జీహెచ్ఎంసీ స్వీపర్స్‌కు ఆమె చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంత సంపాదించినా రాని ఆనందం పేదరికంలో మగ్గుతున్న వారికి చేయూత అందించడంలో ఉంటుందన్నారు. విమల సుధాకర్‌రెడ్డి ఫౌండేషన్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారానే గుర్తింపు లభిస్తుందన్నారు. నిరుపేదలకు తమవంతు సహాయం అందించడమే కాకుండా పేద విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ, వీధి కుక్కల సంరక్షణ, పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె చెప్పారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం, దివ్యాంగులకు తమవంతు సహాయ సహకరాలు అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. తమ ఫౌండేషన్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ చైర్మన్ దేవిరెడ్డి శ్వేతారెడ్డి, ప్రతినిధులు సుశీల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.